"హేపీ బర్త్‌డే! ఎండ్ మెనీ మెనీ హేపీ రిటర్న్స్!" అంటూ చేతిలోని పాకెట్, బుకే మమత అందించాడు శేఖర్.

"థాంక్యూ!" అని అతనికి ఒక చిరునవ్వు ఇచ్చి కొంచెం అతని వైపుకి వంగి, చెవిలో చెబుతూన్నట్టు, "ఏమిటిది?" అని అడిగింది మమత.

"నువ్వే చూడు" అన్నాడు చిరునవ్వుతో శేఖర్.

అప్పటికి చాలామంది గెస్టులు వచ్చేశారు. అందరూ పై తరగతి మనుషులు. ఆశ్చర్య పడవలసిందిదేమీ లేదు. అందరూ మంచి బహుమతులు తెచ్చినట్టు ఉన్నారు. చాలా పాకెట్లు ఆమె పక్కన మేట వేసినట్టు పడి ఉన్నాయి. అందరూ కలకల లాడుతూ ఆ రోజు కోసం ప్రత్యేకం వేసిన షామియానాలో తిరుగుతున్నారు. మమతకీ, ఆమె తండ్రికీ కావలసిన వాళ్ళు ఈ రోజుకి అక్కడ గెస్టులు.

అయినా తనని చూడగానే మమత ముఖంలో ఒక్కసారిగా వెలికి వచ్చిన సంతోషమూ, ఆమె ఎంతో అభిమానంగా కొంతదూరం నడిచివచ్చి తనని రిసీవ్ చేసుకోవడమూ శేఖర్‌కి చాలా తృప్తిని ఇచ్చాయి.

ఎందుకంటే, ఆ పార్టీకి తాను రావడం డాక్టర్ సురేష్‌గారికి, అంటే మమత తండ్రికి ఏమీ ఇష్టం లేదని అందరితోపాటు అతనికికూడా తెలుసును. ఆయన కెమిస్ట్రీలో రిసెర్చి చేసి, మంచి మంచి ఉద్యోగాలు చేసి చివరికి స్వంతంగా ఫాక్టరీ పెట్టుకుని హాయిగా ఉంటున్నారు. పుట్టినది అతి చేద కుటుంబం అయినా ఆయన చివరికి చాలా పెద్ద మెట్టు ఎక్కినట్టే మరి! అటు చదువూ, ఇటు ఆస్తి ఉండి రాణిస్తూన్న డా. సురేష్‌గారికి తన ఒక్క అమ్మాయికే చాలా మంచి సంబంధం

# చిన్న గొలుసూ - పెద్ద గొలుసూ

## ఇచ్ఛాపురపు జగన్నాథరావు



వచ్చు గొప్పవాడి కాపై నిచ్చి గొప్పగా పెళ్ళి చేయాలని ఉండడం శేఖర్ దృష్టిలో క్షంతవ్యమే కాని స్వంత కూతుర్ని లాబ్‌లకి స్పెసిమన్ లాగ తన కోరిక ప్రకారం మార్చుదలచుకోవడం అంత క్షంతవ్యం కాదు. తనకి ఉన్నంత బలంగా కాకపోయినా మమతకూడా అలాటి ఆలోచన పెట్టుకునీ, అలాటి శుభ దినం నాడు శేఖర్ శుభాకాంక్షలు ప్రత్యేకం కోరుకునీ, తనకి ఆహ్వానం పంపిందనీ అతనికి తెలుసును.

ఆమె కళ్ళలోని మెరుపు మిగిలిన అలంకారాలన్నిటి కన్నా అతనికి అందంగా కనిపించింది. చాలా సేపు అత నామె నించి కళ్ళు తిప్పుకోలేకపోయాడు. మరొక రిద్దరు అతిథులు రావడం వల్ల అతను ఆమె నించి కొంచెం దూరంగా వెళ్ళి నిలబడ్డాడు.

బేరర్లు అందరికీ టిఫిన్లు, ఐస్‌క్రీమ్ ఇస్తున్నారు. టేబిల్స్ దగ్గర కూర్చునీ అతిథులు తింటున్నారు. సురేష్‌గారు ఒక్కొక్క అతనినీ పలకరించి, కరచాలనం చేసి, కొంచెం సేపు మాటలాడి మరో అతిథి దగ్గరకు వెళ్తున్నారు. ఆయన శేఖర్ ఉన్న దిక్కుకి తన దృష్టి పడకుండా ప్రత్యేకమైన జాగ్రత్త తీసుకుంటూన్నట్టు ఉన్నారు. ఒక విధంగా అదీ మంచిదేనన్నుకున్నాడు శేఖర్. లాంఛనంగా తనని పలకరించి, టిఫినూ, టీ ఇచ్చి వెళ్ళిరా బాబూ అంటే ఆ కొద్ది నిమిషాల్నాకూడా మమతని చూసే యోగం ఉండదు.

అతను మమత నలాగే చూస్తూ ఒంటరిగా ఉండిపోయాడు. ఆమెని గొప్ప అందగత్తె అనడం నిజం కాదు కాని, ఆమె చక్కటి మనిషి అని మాత్రం ఆమె శత్రువులుకూడా అంగీకరిస్తారని శేఖర్ అనుకున్నాడు. దానితోపాటు ఆమె చిరునవ్వు అందంలో ఎక్కడ ఏ చిన్న లోటు ఉన్నా ఆ చిరునవ్వు వాటన్నిటినీ మరుగు చేసి 'నన్ను చూడండి' అంటూన్నట్టు ఉంటుంది.

ఇంకా గెస్ట్లు వస్తూనే ఉన్నారు. వాళ్ళని పలకరించి వాళ్ళు ఇచ్చే శుభాకాంక్షలకి జవాబులు చెప్పడం ఆమెకి కొంత ఇబ్బందిగా ఉండనుకున్నాడు శేఖర్. ఆ ఇబ్బందికి కారణమూ అతనికి తెలుసును. తియ్యటి ఆకారణం శేఖర్‌ని చాలా సంతోష పెట్టింది. కాని మమత మీద జాలినీ కలుగ జేసింది.

అతన్నెవరూ పలకరించ లేదు. ఒక బేరర్ కూల్ డ్రింక్ ఒకటి అతనికిచ్చాడు. అదే చేతిలో పెట్టుకుని శేఖర్ రెండు మూడు నిమిషాల కొకసారి సిప్ చేస్తూ కాలం గడుపుతున్నాడు.

చివరికి ఇంక వచ్చేవారు లేరని నిర్ధారించుకున్నారు కాబోలు సురేష్‌గారు మమతతో ఏదో అని ఆమెని గెస్ట్ల దగ్గిరికి తీసుకుని వెళ్ళారు. మళ్ళీ మళ్ళీ పరిచయాలు చేస్తున్నారులా ఉంది. పరస్పర నమస్కారాలు జరుగుతున్నాయి. ఉండీ ఉండీ కొంత మంది అతిథులు మమత చెంపల్ని తాకుతున్నారు. వయసు మళ్ళిన వాళ్ళకి ఇదో జబ్బులే అనుకున్నాడు శేఖర్.

అంతకన్నా అతన్ని బాధ పెట్టింది ఆ గుంపులో ఇద్దరు ముగ్గురు స్మార్ట్ యంగ్‌మెన్ ఉండడం. విచిత్రంగా ఆ ముగ్గురూ ఒక చోటనే నిలబడ్డారు. ఒకరి చేతిలో సిగరెట్ ఉంది. కొంచెం దూరం నించి చూసినా, వాళ్ళముఖాలలో చిరునవ్వులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వాళ్ళ బట్టలు చాలా ఖరీదైనవని తెలుస్తూనే ఉంది. అది గమనించిన శేఖర్‌లో సంతృప్తీ, ఈర్ష్యా రెండు పాళ్ళలో కలిగాయి. ఆ బట్టలవల్లనే వాళ్ళు అంత స్మార్ట్‌గా కనిపిస్తున్నారు కాని, సహజంగా కాదని సంతృప్తి. కాని ఆ బట్టలు చూస్తే.

తన దుస్తులని ఒకసారి చూసుకున్నాడు శేఖర్. తల్లితండ్రులనీ, ఇద్దరు చెల్లెళ్ళనీ, ఒక తమ్ముడినీ పోషించాల్సిన గుమాస్తా బట్టలు ఎలాగ ఉండాలో అలాగే ఉన్నాయి. ఇవేళ ప్రత్యేకంగా తన కున్న వాటిలో మంచివి చూసుకుని ఇస్త్రీ చేసి వేసుకున్నా తన బట్టలు వెలవెల పోతున్నాయి.

"ఐస్‌క్రీమ్ సార్!" అంటూ అతన్ని మేల్కొలిపాడు బేరర్. శేఖర్ ఐస్‌క్రీమ్ తీసుకుని తిన్నాడు. చాలా బాగుంది. అతనికి ఆకలిగా ఉంది. అందరిలాగా టేబిల్ దగ్గిరకి వెళ్ళి ఒక ప్లేటు తీసుకుని, టేబిల్ మీదని ఉన్న పదార్థాల్లో తనకి కావలసినది తీసుకునే ధైర్యం లేదు. బుఫే చాలా స్టయిల్‌గా ఉంది. కాని తన లాటివాడికి అది లాభం లేదు.

తినడం ముగించి ప్లేటు ఎక్కడ పెట్టాలో నిర్ణయించుకుని తల ఎత్తి చూసేసరికి శేఖర్ నాలిక మీద ఐస్‌క్రీమ్ తీపి మిగలలేదు. మమత ఆ ముగ్గురు యువకుల మధ్య నిలబడి వాళ్ళతో ఏమిటో మాట్లాడు తూంది. ఆమెలో కొత్త చైతన్యం వచ్చినట్టు ఉంది. వాళ్ళు ముగ్గురూ సరేసరి. ఆమెని కళ్ళతోనే తాగేసేలాగ చూస్తున్నారు.

ఏం చెయ్యాలి?

కష్టపడి చదివి పాసైన ఎమ్మే చదువు ఎక్కడా ఈ పరిస్థితికి తగిన చర్య ఏమిటో, ఎలాగ తీసుకోవాలో శేఖర్‌కి చెప్పలేదు. క్రమంగా అతనితో కోపం తాపు చేసుకుంది. దానిలో ఎక్కువ భాగం ఆ ముగ్గురి మీదా. వాళ్ళకి మేనర్స్ తెలీవు. లేకపోతే అంతమంది అతిథులు ఉండగా ఆమెని మోనోపొలైజ్ చేసి అలా నిలబెడతారా? వీళ్ళకి డబ్బు ఉంది కాని సంస్కారం లేదు. పోనీ, మమతకైనా బుద్ధి ఉండ నక్కర లేదూ? వాళ్ళలో అలాగ ఒక్కు సరిపోయి మాట్లాడక పోతే ఏం? పది నిమిషాల నుంచి ఆమెకి తన వైపు ధ్యాస లేనేలేదు!

అతనికి ఒక ఆలోచన వచ్చింది.

ఇలాటి పరిస్థితుల్లో తానుకూడా వెళ్ళి ఆ యువకులతో కలిసిపోయి నవ్వులతో కబుర్లు చెప్పాలి. లేదా, ఎవ్వరూ చూడకుండా నెమ్మదిగా బయటికి జారుకోవాలి. మొదటిది తాను చెయ్యలేడు. అందరికీ అందరినీ పరిచయం చేసినా, తనని మాత్రం ఎవరూ ఎవరికీ పరిచయం చెయ్యలేదు. తనకి జరుగుతున్న అవమానంలో అది మొదటి మెట్టు. తాను ఇక్కడికి వస్తే పెద్ద గౌరవం జరుగుతుందని శేఖర్ అనుకోలేదు. ఆఫ్టరాల్ సురేష్‌గారి ఎన్నో ఫాక్టరీలలో ఒక దానిలో తాను అతి చిన్న ఉద్యోగి మాత్రమే! అయినా, ఇంత అన్యాయంగా ఉంటుందనీ అనుకోలేదు. మమత అంత పట్టు పట్టి ఉండకపోతే, తను ఉండేవాడు కాదు. వచ్చినా, కానుక ఇయ్యగానే తాను

శ్రీటెక్స్
ఫ్యాబ్రిక్స్
ఇంటింటి
అవసరాలకు...
ఇంటిల్లిపాది
ఆనందానికి...
శ్రీటెక్స్
దుప్పట్లు
శ్రీటెక్స్
తువ్వాళ్ళు
శ్రీటెక్స్
ఫర్నిషింగ్స్
అందానికి...
ఆకర్షణకి...
మన్నికకు...నమ్మికకు
మేలైన రంగులకు
వాడండి!
nvkr Bachi
SreeTEX® SALEM
ఉత్పత్తిదారులు:
ఓ.జి. టెక్స్‌టైల్స్
(ప్రై) లిమిటెడ్.
సేలం-636006

తిరిగి వెళ్ళిపోవలసిందే! కాని మమతని చూస్తూంటే వదలాలని అనిపించలేదు. అదీకాక, ఆ స్మార్ట్ యంగ్ మేన్ మధ్య ఆమెని వదిలేసి తాను తిరిగి వెళ్ళిపోతే ఫలితం తనకి లాభదాయకంగా ఉండకపోవచ్చును.

కాని రెండో విధానం—పలాయనం కూడా అతనికి నచ్చలేదు. కాని, విపరీత పరిస్థితుల్లో మంచికీ చెడ్డకీ మధ్యకాక రెండు బాధాకరమైన మార్గాలలో వాటిలో ఏదో ఒకటి అవలంబించాల్సి ఉంటుందని శేఖర్‌కి అనిపించింది. అందుచేత అతను బయటికి వెళ్ళే దారిలో బరువుగా రెండడుగులు వేశాడు.

అతని భుజం మీద చెయ్యి ఎవరిదో!

“వెళ్ళిపోతున్నావా? అప్పుడేనా?” అంటూ సురేష్‌గారు పలకరించారు. ఆయన ముఖంలో చిరునవ్వు ఉంది. 'ఎంత హుందాగా ఉన్నాడు! అనుకున్నాడు శేఖర్ ఆయన్ని ద్వేషిస్తూనే.

“అవునండి! అంటే అదే” అన్నాడు శేఖర్.

“టిఫిన్ తిన్నావా?”

“ఆకలిగా లేదండీ!”

“నాన్సెన్స్! యంగ్ మేన్‌వి! మా అమ్మాయి పుట్టిన రోజు పండగకి వచ్చావు. టిఫిన్‌కూడా తినకుండా వెళ్ళిపోతే ఎంత అవమానం నాకు?” అంటూ సురేష్‌గారు అతని భుజాన్ని స్టీరింగ్‌వీల్ గానో, హాండిల్‌బార్‌గానో మార్చి శేఖర్‌ని బుఫే టేబిల్ దగ్గిరికి తీసుకెళ్ళారు.

శేఖర్ వద్దంటున్నా రెండు ప్లేట్లు, కేక్, కారపు సామాన్లు అన్ని ప్లేట్ల నిండా వేయించి అతనికి ఇచ్చి “కమాన్! ఇవి తిని మళ్ళీ మరి కొంచెం తినాలి తెలిసిందా!” అన్నారు.

“ఇవే ఎక్కువ సార్!” అన్నాడు శేఖర్.

“నాన్సెన్స్!...వ్యక్తిగతంగా నీకూ, నీ కంపెనీ యజమానిగా నాకూ చిన్నతనం తెచ్చేలాగ ప్రవర్తించకు! నేను చూస్తూ ఉంటాను. ఇవి తిన్నాక ఐస్‌క్రీమ్ ఎలా ఉందో చూడు—”

“ఐస్‌క్రీమ్ ముందరే తిన్నాను...”

“మరోసారి. ఆ తరవాత రా. అందరికీ పరిచయం చేస్తాను” అని సురేష్‌గారు రెండడుగులు వేసి మళ్ళీ వెనక్కి తిరిగి ప్రసన్నమైన చిరునవ్వు నవ్వి, మిగిలిన అతిథుల దగ్గిరికి వెళ్ళిపోయారు.

ఈ ఉదంతంతో తనకి జరుగుతున్న అవమానం కొంత తగ్గిందని అనుకున్న శేఖర్ సంతోషం, తాను తినవలసిన వాటిని చూసేసరికి తక్కువ అయిపోయింది. ఆయన తనకి ఒక పరీక్ష పెట్టినట్టుంది! ఆ పరీక్ష కేవలం తాను ఎంత తింటాడని మాత్రమే కాదు. అందరూ తినడం ముగించాక తానొక్కడూ సీరియస్‌గా ప్లేటునిండా పేర్చిన ఈ సామానంతా ఎలాగ తినడం అన్నది కూడా ఆ పరీక్ష.

ఆ ప్లేటు అక్కడ పెట్టి తాను బయటికి నడిస్తే...?

సురేష్‌గారు నిజంగా కోపం తెచ్చుకుంటారు. ఈ కోపం ఇల్లు దాటి కంపెనీకి వెళ్ళి తీరుతుంది. ఈ రోజుల్లో ఉద్యోగాలు సులువుగా దొరకవు. ఈ చిన్న ఉద్యోగంకోసం తానెన్ని పాట్లు పడ్డాడో శేఖర్ మరచిపోలేదు. ఏడుకొండలూ ఎక్కి అక్కడ స్వామివారికి తన గిరజాల జుత్తు ఇచ్చుకుని రెండేళ్ళు కూడా కాలేదు!

సురేష్‌గారి కోపంకాక — మమత కూడా చిన్నబుచ్చుకుంటుంది. మధురమైన పాటికేం, అందమైనదైనా తన జీవితంలో సంఘటనలు ఏమీ లేని నిస్సారమైన తన జీవితంలోకి మమత మాధుర్యాన్నీ, సౌందర్యాన్నీ తెచ్చింది. శేఖర్ జీవితంలోకి ఆమె రాక, ఆకలితో అలమటిస్తున్నవాడి చేతిలోకి ఈ క్షణంలో తన చేతిలో ఉన్న ఈ ప్లేటు వచ్చినట్టు ఉంది.

శేఖర్ తినడం మొదలుపెట్టాడు.

స్వీట్—రసగుల్లా చాలా బాగుంది.

శేఖరికి జ్ఞాపకం వచ్చింది—మొట్టమొదట మమతని చూసినప్పుడు అతనికి రసగుల్లా జ్ఞాపకం వచ్చింది అని.

అది జరిగి నాలుగు నెలలు రేపటికో ఎల్లుండికో పూర్తి అవుతాయి.

ఆరోజు మెట్రోలో ఏదో మంచి పిక్చరుందని శేఖర్ బయలుదేరాడు. ఆదివారం. మధ్యాహ్నం ఆలస్యంగా భోజనంచేసి నిద్రపోవడాన్న, కొంత ఆలస్యంగానే థియేటర్‌కి చేరేడు. తాను టికెట్



national-610 A

కొనదల్చుకున్న క్లాసూ, దానిమీదదీ, ఇంకా అన్నిటికన్నా ఖరీదైనదీ—అన్ని క్లాసుల్లోనూ హవుస్‌ఫుల్ బోర్డులు ఎదురయాయి.

టికెట్ బ్లాకులో కొనడం శేఖర్‌కి సరిపడదు. సినిమాకని ప్రత్యేకించిన చిన్న మొత్తంలో ఇలాటి అనవసరమైన ఖర్చులుపెట్టడం ఆలోచన కూడా రాదతనికి. కాని, ఒక్కొక్కసారి చివరి నిమిషంలో అసలు ఖరీదుకే టికెట్లు దొరుకుతూ ఉంటాయి. అందుకని అతను లాబీలో నిలబడ్డాడు. చుట్టూ కలియజూశాడు. ఎంతోమంది లేరక్కడ. లోపలికి పోయి హాయిగా ఆ చల్లదనంలో కూర్చుని ఉంటారు. అక్కడ ఉన్న నలుగురైదుగురిలోనూ ఒక అమ్మాయి కనిపించింది.

ఆమె తెల్లటి చీర, తెల్లటి బ్లవుజూ వేసుకుంది.

కాలికి తెల్లటి చెప్పులు.

మెడలో ముత్యాలదండ.

ఆ బట్టల్లో ఎంతో చక్కగా ఉంది ఆ అమ్మాయి. రసగుల్లాలాగ! అనిపించింది బ్రహ్మచారి శేఖర్‌కి. ఎవరేమనుకున్నారేనని ఆమెనించి కళ్ళు తిప్పుకోకుండా వాటికి విందుచేశాడు అతను. చిన్నప్పుడు చదువుకున్న తెలుగులో ఇలాటి అమ్మాయిని దేనితో పోల్చాలో ఎక్కడా చెప్పలేదు గాని, ఆమె పాలనురగతో చేసిన బొమ్మలాగ ఉందని అనిపించింది శేఖర్‌కి.

ఆమె మాటిమాటికీ తన వాచ్ చూసుకోవడమూ, బయటికి చూస్తుండడమూ గమనించిన శేఖర్‌కి సంగతి సులువుగానే బోధపడింది. అతనెవరో అదృష్టవంతుడు—అన్న ఆలోచన వాడెవడో వట్టి ఇడియట్! లేకపోతే ఇంత చక్కటి అమ్మాయిని ఎదురు చూసేలాగ చేస్తాడా? అన్న నిర్ణయానికి తోవ ఇచ్చింది.

చివరికి ఆమె నిరాశ చేసుకుందిలా ఉంది—ఎంతో అందమైన విసుగుదలతో భుజాలు ఎగరేసి లోపలికి నడుస్తూ, పక్కకి తిరిగింది—ఆమె కళ్ళు శేఖర్‌మీద పడ్డాయి.

ఉపోద్ఘాతం లేకుండానే — ''టికెట్‌కోసమా?'' అంది.

''అవునండీ'' అన్నాడు శేఖర్. ఆమెనించి గుబాళిస్తున్న పరిమళం అతన్ని ఇంకా ఉక్కిరిబిక్కిరి చేస్తుంది.

''కమాన్!'' అంది, ఆజ్ఞ జారీచేస్తున్నట్టు.

''టికెట్—టికెట్'' అన్నాడు ఒక జేబులో చెయ్యి పెట్టుకుని.

''బస్ కండక్టరులాగ టికెట్ టికెట్‌అంటారేం? నా దగ్గర ఉంది—వచ్చేలా ఉంటే రండి'' అంది లోపలికి దారితీస్తూ.

''వస్తానండీ! డబ్బులు తీసుకోండి'' అన్నాడు ఆమెని అనుసరిస్తూ.

''తరవాత తీసుకుంటానులెండి'' అంది ఎంతో తియ్యగా నవ్వుతూ. ఆమె నవ్వితే వెన్నెలలాగ ఉంది శేఖర్‌కి. ఆమె వెనకాల నడుస్తూంటే అతనికి చాలా గర్వంగా ఉంది. లోపల దీపాలు బాగా డిమ్ చేశారు. లేకపోతే చాలామంది కళ్ళు వాళ్ళిద్దరి మీదా పడి అతనికి ఇంకా ఇంకా గర్వం కలిగించి ఉండేవి.

సినిమా సగం అయి, ఇంటర్వెల్ వచ్చేదాకా ఆమె ఏమీ మాట్లాడలేదు. అతనికి మాట్లాడాలని ఉంది. కాని గొంతుక తడి ఆరిపోయినట్టు ఉంది. అదీకాక, అదొక రమ్యమైన కలలాగ ఉంది. మాటలాడితే ఆ కల చెదిరిపోతుంది.

''పదండి—కాఫీ తాగివద్దాం'' అంది మమత. ఆమె వెనుక తాను కూడా బయటికి వచ్చాడు. అతను జేబులోనుంచి డబ్బుతీసి ఇచ్చేలోపల ఆమె డబ్బు ఇవ్వడం, వెనువెంటనే కాఫీ రావడం అంతా జరిగిపోయింది. కాఫీ తాగి ఆమె తన బేగ్‌లో వెతుకుతూంటే శేఖర్ వక్కపొడి పొట్లం త్వరగా తెచ్చి ఇచ్చాడు. ముఖమంతా నవ్వు చేసుకుని, ధన్యవాదాలు చెప్పింది మమత.

''నాకీ వక్కపొడి చాలా ఇష్టం'' అంది.

''నాకూను'' అన్నాడు శేఖర్.

''నా పేరు మమత''

''నేను—శేఖర్.''

''పదండి—లోపలికి పోదాం''

లోపలికి వెళ్ళారు. అది ఏమి సినిమానో, అందులో ఏం జరిగిందో శేఖర్‌కి ఏమీ జ్ఞాపకం లేదు. మమత పిక్చర్‌ని అంత జాగ్రత్తగా చూడటం అతనికి కొంత నిరుత్సాహాన్ని కలియజేసినా, కేవలం ఆమెకంత దగ్గిరగా కూర్చోవడం అతనికి ఆహ్లాదం కలుగజేసింది.

సినిమా ముగియగానే బయటికి వచ్చారు.

''మా కారు—ఎక్కడ పార్కుచేశాడో!'' అంది చుట్టూ మనుష్యుల్ని పరికిస్తూ. డ్రైవర్‌కోసం కాబోలుననుకున్నాడు శేఖర్.

''నెంబరు చెప్పండి — నేను వెతుకుతాను'' అన్నాడు.

పది నిమిషాలు చాలాచోట్ల వెదికాక కనిపించింది కారు. డ్రైవర్ మంచి నిద్రలో ఉన్నాడు. వాణ్ణి లేపి, కారుతో సినిమా హాలుముందుకు వచ్చేడు.

''చాలా థాంక్సండీ! నేను వెడతానింక'' అంది మమత, రెండు చేతులు జోడించి. ఆ భంగిమలో ఆమె అజంతా సుందరిలాగ ఉంది.

''మీకు డబ్బివ్వాలి!...టికెట్‌కి.''

విలాసంగా నవ్వుతూ, ''నేను టికెట్ల వ్యాపారిని కాదు !...నా దగ్గర టికెట్ ఒకటి ఎక్కువైంది—మీరు కనిపించారు...మళ్ళీ థాంక్స్!''అని,కారెక్కుతూ ''ఎక్కడైనా డ్రాప్ చెయ్యమంటారా?'' అంది.

''ఇప్పటికే మీకు శ్రమ ఇచ్చాను...''

''కారుంది. డ్రైవరున్నాడు...నాకు శ్రమఏమిటి? రండి'' అంది. అతను వెళ్ళి డ్రైవరు పక్క సీట్లో కూర్చోబోతే తన పక్కన కూర్చోమన్నాని, ''ఎక్కడికి వెళ్ళాలి?'' అంది.

''మీరు ఎక్కడ దిగుతారు?'' అన్నాడు శేఖర్.

''నేను చాలాచోట్లకి వెళ్ళాలి.''

''అయితే నేను బస్ డిపో దగ్గర దిగుతాను'' అన్నాడు.

కారు కదిలిపోయింది. ఏ సందర్భమో అతనికి గుర్తులేదు గాని, ఫలానా కంపెనీలో పని చేస్తున్నానని చెప్పేసరికి ''ఓ! ఆ కంపెనీలో మా డాడీకూడా ఉన్నాడు'' అంది.

''ఎవరాయన? ఏం చేస్తూ ఉంటారు?''

చెప్పింది. చెప్పి అతని వివరాలు అడిగింది.

అన్నీ విని, ''మీరు కాలనీలో ఉండడంలేదా?'' అంది మమత.

''లేదండీ! అక్కడ దొరక్క బయట ఉంటున్నాను.''

డ్రైవరుకి చెప్పి, శేఖర్ ఎంతగా వద్దంటున్నా అతన్ని ఇంటిదగ్గర దింపి, ''ఎప్పుడేనా కనిపించండి! నిజంగానే!'' అంటూ చెయ్యి ఊపి వెళ్ళిపోయింది.

ఇంకా ఆమె, ఆ తెల్లటి బట్టలు, స్వచ్ఛమైన చిరునవ్వు—అన్నీ ఎంతో వివరంగా జ్ఞాపకం ఉన్నాయతనికి. ''దటీజ వాట్‌బేడ్! ఇంకొక్క రసగుల్లా?'' అని అడుగుతూన్న సురేష్‌గారి గొంతుక అతన్ని మళ్ళీ ప్రస్తుతానికి తెచ్చింది.

''మరి వద్దు సార్! థాంక్స్!''

''ఒకే. కాఫీ? టీ?''

''కాఫీ.''

నిమిషంలో కాఫీ వచ్చింది. మరో నిమిషంలో అతను తాగడం అయిపోయింది.

''వేడిగా లేదనుకుంటాను.''

''ఫరవాలేదండీ! నా కిలాగే అలవాటు.''

ఎందుకో తెలీదుగాని సురేష్‌గారు పెద్దగా నవ్వి,


# ఉమేష్ యోగ దర్శన్




(రెండవ భాగం)
గ్రంధకర్త : యోగిరాజ్ శ్రీ ఉమేష్ చంద్రజీ
ఇంగ్లీషు లేదా హిందీ ప్రతి ధర : రు. 30/-
పోష్టేజి : రు. 5/- అదనం.
ఇది యోగం పైన బ్రహ్మాండమైన వ్యాఖ్యానం. దీనిలో ప్రాణాయామం, నిర్లిప్తత, మనస్సు కేంద్రీకరణ, ధ్యానం, సమాధిలోని వేర్వేరు దశలు, సరియైన చిత్రాలలో, సుగమంగా ఉండేటిరులో రాయబడినది. గంధకర్త యొక్క స్వానుభవంపై ఆధారపడిన యీ పుస్తకం, మీలో కుండలిని ఏ రకంగా జాగృతం చెయ్యాలో బోధపరుస్తుంది.

శ్రీ రామ్‌తీర్థ్ యోగాశ్రమ్

Tel.(II)

దాదర్ (మధ్య రైల్వే), బొంబాయి 400 014. ఫోన్ : 442899.

"... నన్ను మా శ్రీమతికి, మమత ఫ్రెండ్స్‌కీ పరిచయం చేస్తాను." అన్నారు.

శేఖర్‌కి ఒణుకులాంటిదేదో పుట్టింది. ఈ పరిచయాలూ అవీ అతనికి అసలు అలవాటు లేదు. దానికితోడు, నీళ్ళంతా ఫ్యాషన్ ... అంతకన్నా ముఖ్యం మమత కేవలం ఒక చక్కని చుక్కమాత్రమే కాదు. ఆమె ఒక తల్లికి, తండ్రికి బిడ్డ. ఎవరికో చెల్లెలు. ఎవరెవరికో స్నేహితురాలు.

"మా శ్రీమతి ... నేను రోజూ మీకు మమత చెప్తూంటుండే, ఆ శేఖర్ ఇతనే అంటూ పరిచయం చేశారు సురేష్‌గారు.

నమస్కారం, ప్రతినమస్కారం అయ్యాక అతన్ని తిన్నగా మమత దగ్గరికి తీసికెళ్ళాడాయన!

"మీట్ డాక్టర్ ప్రభు. మిస్టర్ వేణు, మిస్టర్ సుధీర్" అంటూ తననీ వాళ్ళకి పరిచయంచేశాడు. ప్రభుగారు ఎమ్. డి. ఏదో స్పెషలిస్టట. వేణు ఇంజనీరు, సుధీర్ సి. ఏ. దగ్గర నుంచి చూసినా అందరూ చాలా స్మార్ట్‌గా ఉన్నారు.

"థాంక్స్ డాడీ! పూర్ శేఖర్ మాటే మరిచిపోయాను" అంది మమత. అంతగా ఆమె బాధపడిపోయినట్టు గమనించి శేఖర్ కొంచెం బాధపడినా ఆ రోజు ప్రత్యేకత గుర్తించి సర్ది చెప్పుకున్నాడు.

పరిచయాలు ముగించి సురేష్‌గారు వెళ్ళిపోయారు. అప్పటిదాకా ఏదో చాలా ఉత్సాహంగా మాట్లాడుకుంటున్న ముగ్గురూ మాటలు రానట్టు అలాగే మౌనంగా ఉండిపోయారు. అలా పది నిమిషాలు గడిచాయి. మమత ఎలాగైనా సంభాషణని పునరుద్ధరించాలని ప్రయత్నించింది. కాని వాళ్ళు చర్చించే సినిమాలు, క్లబ్బులూ, ... గురించి శేఖర్‌కి ఏమీ తెలీదు.

చివరికి అతను "నేను వెళ్ళి వస్తాను మమతా!" అని చెప్పినప్పుడు వాళ్ళందరి ముఖాల్లోనూ గొప్ప రిలీఫ్ కనిపించింది. వాళ్ళలో మమత కూడా ఉంది.

సుమారు మైలు దూరం నడిచి శేఖర్ బస్ స్టాండుకి నడిచాడు. దారిలో అతనికి మమతతో గడిపిన క్షణాలు జ్ఞాపకం వచ్చాయి. ప్రతీరం వా కనీసం రెండుసార్లు ఆమె అతడ్ని కలిసేది. ముందరే అనుకుని పార్కులోనో, బీచిలోనో కలుసుకుని రకరకాల కబుర్లు చెప్పుకోవడం అతనికి జ్ఞాపకం వచ్చింది. కొన్నిసార్లు మమత ఆఫీసుకి ఫోను చేసి అతన్ని రమ్మనేది. అయిదారుసార్లు వాళ్ళిద్దరూ సినిమాలకు కూడా వెళ్ళారు.

కాని ఇవేళ మమత ఏమిటో దూరంగా వెళ్ళిపోయినట్టు ఉంది.

నిన్నటిదాకా శేఖర్ చాలా సినిమా కలలు కన్నాడు. ఆస్తులూ అంతస్తులూ ముఖ్యం కావనీ, ఆంతర్యాలు ముఖ్యం అనీ మమత కూడా తనలాగే గట్టిగానే నమ్ముతుందని అత నమకున్నాడు. కొద్ది కాలంలోనే అది జరిగి పోతుందనీ అతను, న్యాయంగానే అనుకున్నాడు. మరి మమత ఒక సారి ఏమంది? "మనం ఎప్పుడూ ఇలాగే ఉండిపోవాలి శేఖర్! ఎవరూ మనల్ని విడదీయలేరు" అని. ఆ సాయంత్రం ఉత్తుంగ తరంగాలూ, ఉదయిస్తూన్న చందమామా సాక్షులుగా ఉన్నారు.

మరోసారి, "నీకు మరీ భయం శేఖర్! నన్ను చూడు — భయం అంటే వింత నాకు! మనం పెళ్ళాడితే ఆదర్శ దాంపత్యం అవుతుంది" అంది. ఆ వేళ ఆ మాటలకి పార్కులో చెట్లు సాక్షి ... కాని, ఇవేళ 'తమతమ నెలవులు' లోపలఉన్నట్టు, తల్లిదండ్రులూ, స్నేహితులూ మధ్య ఉన్న మమత ఏమిటో కొత్తగా కనిపిస్తోంది. ఈ రోజు కొన్ని మధుర క్షణాలు లేవని కాదు. కాని, ఆశించిన దానిలో కన్న అవి చాలా తక్కువ.

అతను హోటల్‌కి వెళ్ళి భోజనం చేయడం ఈ రోజు వృథా శ్రమ అనుకున్నాడు. అతనికి ఆకలీ లేదు. తినాలని కోరికా లేదు. కనీసం మమత అతని బహుమతి చూసి సంతోషిస్తే అదే చాలు. తన సేవింగ్స్, ఆఫీసులో పుట్టగలిగినంత అప్పూ అన్నీ కలిసి రెండువేలు ఖర్చు అయింది చిన్న గొలుసుకి. అది లంచంలాగ ఇవ్వలే దామెకి. కాని ఆ చిన్నపెట్టెలో ఏముందో కూడా తెలీ దామెకి.

రూముకి వచ్చి నిట్టూర్చి, మంచి నీళ్ళు తాగి నిద్రపోయే ప్రయత్నం చేశాడు. కాని నిద్రరాలేదు.

ఆ రాత్రి మమతకీ నిద్రలేదు.

అతిథులందరూ వెళ్ళాక ఆమె గిఫ్ట్స్ అన్నీ తెరిచి చూసింది. శేఖర్ ఇచ్చిన బహుమానం ఆమెని ఆశ్చర్య పెట్టింది. అతని నెలసరి ఆదాయం ఎంత ఉంటుందో ఆమెకి తెలుసును. అతని కుటుంబ పరిస్థితి కూడా తెలుసును. అంతడబ్బు పెట్టి అతను ఆ బహుమతి తేవడం ఆమెకి సంతోషమూ విచారమూ కూడా కలిగించాయి.

ఆ రోజు సినిమాలో అతను కలిసినప్పుడు చిన్న తమాషాగా అతనితో స్నేహం కలిపింది. అతనెవరో తెలిశాక శేఖర్ తన దగ్గర ఉంటే తన కేమిటో, ఉల్లాసంగా ఉంటుంది. హద్దులుమీరే ధైర్యంలే దతనికి. హద్దు ఎక్కడ ఉండాలో నిర్ణయించేదికూడా తానే. ఇన్ని కలయికల తర్వాత అతని మీద అభిమానం కలిగిన మాట నిజం. కాని, ఈ బహుమతి వెనకాల ఎంత ఆర్థిక సంక్షోభం ఉందో మమత గ్రహించగలిగింది.

తన వూహలు సురేష్‌గారికి చెప్పింది.

"చూడమ్మా! తప్పకుండా అది తిరిగి ఇచ్చెయ్. కాని అతని కెలా ఉంటుందో అది కూడా కొంచెం ఆలోచించు" అన్నా డాయన.

"మీరు అతని పక్షం మాట్లాడటం ఆశ్చర్యంగా ఉంది డాడీ!" అంది మమత. తరచూ ఆమె అయ


Make your own transistor without a risk!



JEWEL
1 Band Kit
Rs. 90/-
+ Local Taxes

SKYLAB 2 Band Kit
Rs. 160/- + Local Taxes

Jetking®



DO-IT-YOURSELF
ELECTRONIC TRAINING KITS

In case your transistor does not work well, we will tune and repair it free of charge.
This offer is open for medium band and two band transistor kits for kids between 12 and 20 years, upto 30th June 1980.

NAVBHARAT RADIO AGENCIES
350, LAMINGTON ROAD, BOMBAY-400 007.

Paramount-NR-9

DEALERS: **Skying Radio Agencies**, 15, Narasinghapuram Street, Mount Road, Madras-2.; **Universal Traders**, 59 B-1, Town Hall Road, Madurai.; **Ramdas Radio Spares**, Stall No. 7, Town Hall Road, Madurai-625 001.; **Sunder Radio & Co.**, Station Road, Cannanore-670 001. **Sunder Radios**, Park View Cape Road, Nagercoil.; **Savit Electronics**, 41/21, Prakasam Road, Governorpet, Vijayawada-2.; **Monys Radio Services**, Quilon.; **Khani Radio, Radio Centre**, Trichy.

నతో అంత సూటిగా మాట్లాడడు. కాని ఆమె నిజంగానే ఆశ్చర్య పడింది.

చిన్న చిరునవ్వుతో "నేను అంత చెడ్డవాడిని కాదమ్మా!" అన్నా డాయన.

"అయితే ..." అంది మమత.

"అడుగు!" అన్నాడాయన. చిరునవ్వు చెదర లేదు.

"మీకు తెలుసును. అడగాలా?" అంది మమత, చాలా ముద్దుగా.

"అడుగు ... లేకపోతే నాకుమాత్రం ఏం తెల్స్తుంది?" అన్నారు సురేష్‌గారు.

"అదే శేఖర్ నే నతని పెళ్ళి చేసుకోవాలంటే మీరు ఇష్టపడతారా?" అంది మమత. అదే టైముకి తల్లి కూడా వచ్చిం దక్కడికి.

"నేను ఇష్టపడను" అన్నారు సురేష్‌గారు.

"మీ పెద్ద తరగతి మనస్తత్వాలు అడ్డు వస్తాయి. ఏం?" అంది మమత.

"కాదు. కాని, నీ మీద అభిమానమూ, శేఖర్ మీద జాలీ అడ్డు వస్తాయి."

"శేఖర్ మీద జాలి! ఎందుకూ?" అంది మమత.

ఆయన సమాధానం ఇవ్వలేదు.

తల్లి కలుగజేసుకుని "ఆయన మాటలకేమిలే! నీకు కావాలని ఉంటే చెప్పు. పెళ్ళి చేసేస్తాం!" అంది.

మమత తెల్లబోయింది.

"డాడీ అంగీకరించరమ్మా!" అంది. ఇదంతా ఆమెకి చాలా వింతగా ఉంది.

భార్యవేపు ప్రశ్నిస్తున్నట్టు చూసి, "అంగీక రించడం వేరు, నాకు ఇష్టం లేకపోవడం వేరు! ఇష్టం లేని పనులు చాలా చేశానమ్మా!" అన్నారు — చివరి మాటలు మమతతో.

"నాకేం బోధపడలేదమ్మా! డాడీ! నాకు స్పష్టంగా చెప్పండి" అంది మమత.

"ఇంతకన్నా స్పష్టంగా చెప్పడాని కేమిటి ఉంది! నీకు కావాలంటే శేఖర్‌ని చేసుకో! పెంచుకుంటూన్న కుక్కపిల్లలాగా నీ వెనకాల తిప్పుకోవచ్చును! నీ మాట కాదనడు. దేనిలోనూ ని న్నెదిరించడు."

"మీరు మరీనీ!" అంది ఆయన భార్య.

"నాన్సెన్స్! అదే నిజం" అని, మమతని దగ్గరగా తీసుకుని, "చూడు మమతా! నీకు ఉపన్యాసం ఇవ్వాలని లేదు కాని, శేఖర్ విషయంలో నేను చెప్పినది నూటికి నూరూ నిజం. అదీకాక ముందుగా శేఖర్‌కి కావల సింది ఆస్తి" అని మరేదో చెప్పబోయి ఆగిపోయారు సురేష్‌గారు.

"అది నూటికి నూరు సార్లూ అబద్ధం" అంది మమత ఉద్రేకంగా.

"అయినా, మీ కన్నీ తెలిసినట్టే చెప్పడం అలవాటు!—అదీ చదువుకున్న పిల్ల, వయసొచ్చింది. జ్ఞానం వచ్చింది. దాని మనస్సు విరవడానికి ప్రయత్నిం చకండి" అందాయన భార్య.

మమతకి ఆశ్చర్యంలో ఏదీ బోధపడలేదు. అస్తమానం స్టేటస్, ప్రాపర్టీ చూసుకునే తల్లి ఇలాగ అనడం ఆమె కేమీ అర్థం కాలేదు. కాని, సురేష్‌గారు వూరుకోలేదు.

"అవును! అతన్ని కట్టుకుంటే దాని వెనకాల గొలుసుతో కట్టిపెట్టుకున్న కుక్కపిల్లలాగ తిరుగుతూ ఎలా చెప్తే అలాగే వింటాడు! నువ్వూ, మమతా అతని మీద పూర్తి అధికారం చెలాయించ వచ్చును!" అన్నారు.

"ఏం? తప్పేమిటి? తరతరాలనించి మీ మగ వాళ్ళు ఆడవాళ్ళని కుక్కలకన్నా హీనంగా చూడలేదూ? ఇవేళ భార్య చెప్పు చేతుల్లో భర్త ఉంటే తప్పే మిటి?" అంది ఆయన భార్య.

మమతకి తల తిరుగుతూన్నట్టు అయింది.

సాయంత్రం జ్ఞాపకం వచ్చింది.

వేణు, సుధీర్, డాక్టర్ ప్రభు ... వీళ్ళని అమ్మా, డాడీ ఎందుకు పిలిచేరో ఆమెకి తెలుసును. వాళ్ళతో గడిపిన నిమిషాలు జ్ఞాపకం వచ్చాయి.

"నేను వెళ్ళి నిద్ర పోతానమ్మా!" అని, మమత తన గదికి వెళ్ళిపోయింది. ఫాన్ పెట్టుకున్నా ఉక్కగా ఉంది. ఎయిర్ కండిషనర్ వేసింది. చల్లగా ఆహ్లాదంగా ఉంది.

ఆమె చాలా సేపు ఆలోచించింది. ఆమె ఆలోచ నల్లో శేఖర్ ఉన్నాడు. అతనితో గడిపిన క్షణాలు, కొన్ని జరిగితే అతనితో గడపబోయే రోజులు గురించి ఆలోచలు సాగించింది. ఆ ఆలోచనలా మధ్య ఎప్పుడో నిద్ర పట్టిపోయింది.

తరవాతి నాలుగు రోజులూ మామూలుగా గడిచి పోయాయి.

ఆ తరవాత ఒకనాడు శేఖర్ ఫోన్ చేశాడు. సాయంత్రం కలుసుకోమనీ, ముఖ్యమైన దేదో మాట్లాడాలనీ.

ఇద్దరూ బీచీలో కూర్చున్నారు.

శేఖర్ చాలా ఉత్సాహంగా ఉన్నాడు.

మమత అవీ ఇవీ గురించి మాట్లాడినా అతని దృష్టి ఆమె మాటల మీద లేదు. ఆ రోజు పార్టీ గురించి మాట్లాడినా అతను "ఆ రోజు నేను రాకుండా ఉండాలిసింది" అని నిర్వికారంగా అనడం తప్పిస్తే మరేమీ చర్చకి తేలేదు "మీ ఫాదర్ చాలా గొప్పవారు" అనికూడా అన్నాడు.

ఇద్దరూ కలుసుకున్న పది నిమిషాలకి మమత, "మీ విశేషా లేమిటి?" అంది.

అతనెదురు చూస్తున్న తరుణం వచ్చినట్టయింది.

అతని ముఖం వెలిగి పోయింది.

"గుడ్ న్యూస్!" అన్నాడు.

"ఏమిటి?" అంది మమత.

"చెప్పుకో చూద్దాం" అన్నాడు శేఖర్.

"లాటరీలో ప్రైజు వచ్చింది" అంది మమత.

"వా! అంతకన్నా మంచిది" అన్నాడు శేఖర్.

"మీ పెళ్ళి మంచి ఆస్తి ఉన్న అందమైన ఒకలక్షాధికారి ఏకైక పుత్రికతో నిశ్చయం అయింది" అంది మమత సీరియస్‌గా.

"కాదు".

"మరి?"

"నాకు అసిస్టెంటు మేనేజరుగా ప్రమోషన్ వచ్చింది!"

"కంగ్రాట్స్! నిజంగా సర్‌ప్రైజు చేశారు!"

"మీ రాశ్చర్య పడతారనే అనుకున్నాను. నిజానికి ఆ సాయంత్రం తరవాత నా ఉద్యోగం వూడుతుందేమో ననే భయపడ్డాను. కాని. ఒక్కసారిగా రెండు మెట్లు పైకి వేశారు. తప్పకుండా మీ ఫాదర్ పనే అయి ఉంటుంది."

సోడా కొట్టగానే గాస్ లాగ అతనిలో ఉన్న ఆనంద మంతా బయటికి వస్తూంది. చిచ్చుబుడ్డి లాగ ఉన్నా డతను ప్రకాశిస్తూ.

"చాలా సంతోషం శేఖర్!" అంది మమత.

"అంతా నీ చలవే మమతా!" అన్నాడు శేఖర్.

"నో. నో. డాడీ దగ్గర ఇలాటి విషయాలలో కలగ చేసుకోను. అసలు ఆఫీసు విషయాలలో ఆయన అమ్మ మాటే వినరు! మీకు ప్రమోషన్ వచ్చిందంటే మీ మెరిట్ అన్నమాట" అంది మమత చాలా గంభీరంగా.

"అంతేనంటావా?" అన్నాడు శేఖర్.

"అంతే! డాడీ చాలా ఖచ్చితమైన మనిషి! మరి, ఎప్పుడు చార్జి తీసుకుంటావు?" అంది మమత.

విచారంగా ముఖం పెట్టి "అదే సాడ్‌గా ఉంది. నాకు విజయవాడ బదిలీ చేశారు. అక్కడ మాత్రమే వేకన్సీ ఉందిట" అన్నాడు శేఖర్. ఆ మాటల్లో పెద్ద విచారం ఏమీలేదు.

"పోనియ్యండి. మీ వాళ్ళమీతో ఉండొచ్చును." అంది మమత.

"అవును."

"ఈ శుభవార్తకి కనీసం కాఫీ అయినా ఇస్తారా?"

"ఓ! తప్పకుండాను! పదండి" అని లేచి నిలబడి బట్టలు దులుపుకున్నాడు శేఖర్.

"ఎప్పుడు ప్రయాణం!" అంది మమత తానూ నిలబడి.

"రేపు."

"ఓ! అలాగా?" అని, "నువ్వు వెళ్ళిపోయే ముందర నాకు ఒక కోరిక ఉంది. తీర్చాలి" అంది మమత.

"తప్పకుండాను."

"ఏమిటో తెలుసునా? ఇదిగో! ఈ గొలుసు దయచేసి తీసుకో. వాదించకు" అంది ఆమె.

"కాని. . ."

"ప్లీజు! నా శుభాకాంక్షలతో మీ చెల్లెలికియ్యి."

అనిష్టంగానే అతను ఆ చిన్న పెట్టె తీసుకుని జేబులో పెట్టుకున్నాడు. "నీకు వాగ్దానం చేసి ఉండకపోతే ఇది తిరిగి తీసుకునే వాడిని కాదు" అన్నాడు. జేబులోనించి పెట్టె తీసిచూసి మళ్ళీ లోపల పెట్టుకున్నాడు.

"నాకు తెలుసు." అంది మమత.

"పద కాఫీ తాగుదాం" అన్నాడు శేఖర్.

"వద్దు శేఖర్! ఇవేళ ఎవరో ఇంటికి వస్తారని చెప్పారు" నేను వెళ్ళి పోతాను."

"కాని, కాఫీ."

"మరో చోట! మరో రోజు" అని మమత నడవ డం మొదలు పెట్టింది.

ఇసకలో ఆమె అడుగులు వేస్తూంది.

వెనువెంటనే అతను.

పాదాల గుర్తులు క్షణంకూడా నిలవడం లేదు.

ఇద్దరూ త్వరగా అడుగులువేసి వెడుతున్నారు.

★